క్లుప్తంగా

సూర్యారావుపేట బీచ్ శుభ్రం



సూర్యారావుపేట బీచ్‌లో స్వచ్ఛత కార్యక్రమంలో ఆదిత్య ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కాకినాడ రూరల్: సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో కాకినాడ ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు శుభ్రం చేశారు. వారు స్వచ్ఛ సముద్ర తీర పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సుమారు 80 ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు బృందాలుగా విడిపోయి ప్లాస్టిక్ వ్యర్థాలు, గాజు ముక్కలు, ఇతర వ్యర్థాలు తొలగించారు. కార్యక్రమంలో ఆదిత్య అకడమిక్ డైరెక్టరు నాయుడు, తేజేశ్వరరావు, అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



మరిడమ్మ ఆలయంలో అన్నదానం

పెద్దాపురం: భక్తుల కోరిన కోర్కెలు తీర్చే పెద్దాపురం మరిడమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారంవారం నిర్వహించే అన్నదానానికి భక్తుల రద్దీ పెరిగింది. ఈ సందర్భంగా ఈఓ విజయలక్ష్మి మాట్లాడుతూ గత నెల ఆషాఢ మాస జాతర ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. మళ్లీ దాతల సహకారంతో అన్నదానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వారం వారం నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి దాతలు సహకరించాలని ఆమె కోరారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఫిక్స్‌డ్ డిపాజిట్లు అందజేత

గోకవరం: మండలంలోని రంపయర్రంపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు రూ.35 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లు అందించినట్టు పాఠశాల స్టాఫ్ సెక్రటరీ పెదిరెడ్ల రాజు ఆదివారం తెలిపారు. జాజుల వీరవెంకట సందీప్, సాయిరాం వివేక్‌ల పేరుతో వారి తండ్రి జాజుల అవతారం రూ.10,116, పెనుగొండ ప్రకాష్ ఆర్చిబాల్డ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు దినేష్ రూ.15 వేలు, పెనుగొండ ప్రసాద్‌రావు జ్ఞాపకార్థం ఆమె కుమార్తె ఈతకొట్టు విజలక్ష్మీబాయి రూ.5 వేలు, సత్యం పెద్దబ్బులు కుమార్తె సత్యం వెంకటశ్రీ చంద్రజ రూ.10,116, పెంటపల్లికి చెందిన మిర్తిపాటి శ్రీనివాస్ రూ.5 వేలు కలిపి మొత్తం రూ.45,348 ఫిక్స్‌డ్ డిపాజిట్ పాఠశాలకు అందించారన్నారు. ఈ మొత్తం మీద వచ్చే వడ్డీతో ఏటా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన బాధిత కుటుంబాన్ని ఆదివారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మరళీకృష్ణంరాజు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన కేదారి శేఖర్ కుమారుడు లోకేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. లోకేష్ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మురళీకృష్ణంరాజు ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నానిపల్లి వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆవుల సంరక్షణకు చర్యలు



గోవులకు పశుగ్రాసం అందిస్తున్న ఇండియన్ డెంటల్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: హిందూ సంస్కృతిలో ఆవును తల్లిగా పరిగణిస్తారని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. అసోసియేన్ ఆధ్వర్యంలో స్థానిక జంతు హింస నివారణ సంఘంలో ఉన్న ఆవుల సంరక్షణ బాధ్యతలను ఆదివారం అసోసియేషన్ చేపట్టింది. ఆవులకు పశుగ్రాసం అందించారు. ఆవు పాలు అత్యంత విలువైనవని, తల్లిపాల తర్వాత పిల్లలకు పోషకాహారానికి ఆవు పాలు ప్రాథమిక వనరు అన్నారు. ఆవు జాతులను రక్షించేందుకు గోశాలలను కాపాడుకోవాలన్నారు. ప్రముఖ వైద్యులు వీరభద్రరావు మాట్లాడుతూ ఆవు పెంపుడు జంతువులకు అత్యంత అనుకూలమైనవని, పురాతన నాగరికతల నుంచి ప్రపంచ వ్యాప్తంగా మానవ సమాజంతో ముడిపడి ఉందన్నారు. భారత దేశానికి పశువుల పెంపకంలో గొప్ప చరిత్ర ఉందని, భారతదేశం పవిత్రమైన ఆవుల భూమిగా పరిగణిస్తారన్నారు.

నిధులున్నా నిర్లక్ష్యం

- సీతారామస్వామి ఆలయ నిర్మాణంలో ఆలస్యం
- ఏడాదిన్నర గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- కల్యాణ మండపంలోనే దేవునికి కైంకర్యాలు



సీతారామస్వామి ఆలయం గోడలు కూల్చి వదిలి వేసిన దృశ్యం

బోట్‌క్లబ్: కాకినాడ మెయిన్ రోడ్డులో ఉన్న సీతారామస్వామి ఆలయం జీర్ణస్థితికి చేరుకుంది. వర్షం వస్తే చాలు గర్భాలయంలో నీరు కారిపోతోంది. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.70 లక్షలు మంజూరు చేశారు. అప్పటి కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఈ ఆలయ జీర్ణోద్ధారణ పనులకు శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి టెండర్లు సైతం పిలిచి ఖరారు చేశారు. అయితే ఇప్పటికీ ఆ పనులు చేపట్టలేదు. నేటికి సరిగ్గా ఏడాదిన్నర గడుస్తోంది. ఇప్పటికీ కూడా ఎక్కడి పనులు అక్కడే ఉన్నాయి. కేవలం ఆలయ గోడలు మాత్రం కూల్చివేసి ఎటువంటి నిర్మాణం చేయకుండా వదిలేశారు. గర్భాలయంలో ఉన్న స్వామివారిని పక్కనే ఉన్న కల్యాణం మండపంలో ఏర్పాటు చేసి అక్కడ నిత్యం పూజలు చేస్తున్నారు. మంజూరైన రూ.70 లక్షల నిధులతో గర్భాలయం, గోపురం చుట్టూ ప్రహరి, గోపుర శిఖరం, ఫ్లోరింగ్, ప్రదక్షిణ మండపం, ఆలయ తలుపులు వంటి చేయాల్సి ఉంది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనులు మొదలు పెట్టలేదు.

రెండో సారి శంకుస్థాపన

నిధులు మంజూరై 18 నెలలు కావస్తున్నా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా ఉంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో ఆలయం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయగా అప్పట్లోనే ఆలయ ప్రహరీ, గోపురం కూడా కూల్చివేశారు. ఈలోగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఈ ఆలయానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మళ్లీ శంకుస్థాపన చేయడం విశేషం. తానేదో నిధులు మంజూరు చేసినట్టు ఆయన మళ్లీ శంకుస్థాపన చేసి ఆలయ నిర్మాణం త్వరగా చేపడతామని ప్రగల్భాలు పలికారు. ఆయన శంకుస్థాపన చేసి సుమారు పది నెలలు కావస్తున్నా పనులు మాత్రం మొదలు కాలేదు. ఈ ఆలయ నిర్మాణం ఎప్పుడు ప్రారంభిస్తారు ఎప్పుడు పూర్తి చేస్తారో దేవదాయశాఖ ఇంజినీరింగ్ అధికారులు సైతం చెప్పలేని పరిస్థితి నెలకొంది. టెండర్ పూర్తయిన తర్వాత ఏడాది లోపు ఈ ఆలయం పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ అసలు పనులు మొదలు పెట్టలేదు. దీనిపై దేవదాయశాఖ ఇంజినీరింగ్ అధికారులు కూడా నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు.

భక్తుల ఆందోళన

నూతన ఆలయం నిర్మించేందుకు 18 నెలల క్రితం స్వామివారిని వేరొక ప్రాంతంలోకి మార్చి ధూప దీప నైవేద్యాలు, నిత్య పూజలు కల్యాణ మండపంలోనే జరుగుతున్నాయి. ఆలయ నిర్మాణం అసలు ప్రారంభించకపోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆలయ నిర్మాణం పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని భక్తులు ప్రశ్నించిన ఆలయ ఈఓ యర్రా వెంకటేశ్వర్రావు భక్తులకు సరైన సమాధానం చెప్పలేదు. టెండర్లు పిలిచామని పనులు ప్రారంభించేందుకు సమయం పడుతుందని సమాధానం చెబుతున్నారని భక్తులు మండిపడుతున్నారు.

త్వరగా నిర్మాణం పూర్తి చేస్తాం



ఆలయ నిర్మాణానికి రూ.70 లక్షలు మంజూరయ్యాయి. ఇప్పుడు సిద్ధ స్థితిలో ఉన్న ఆలయ గోడలు పూర్తిగా తొలగించి రాతితో ఈ ఆలయాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఉదయభాస్కర్, దేవదాయశాఖ డీఈ

వైభవంగా రాధాష్టమి వేడుకలు



రాధాష్టమి వేడుకల్లో పారాయణ చేస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: హరే కృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అశోక్‌నగర్‌లో వింజమూరి వెంకట సుబ్బారావు నివాసంలో రాధాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సంకీర్తన, అనంతరం రాధారాణి మహాత్యంపై ప్రత్యేక ఉపన్యాసం, పారాయణం, ప్రత్యేక భజనలు, మధ్యాహ్నం మంగళహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణా మూమెంట్ ప్రతినిధి వై.కంటేశ్వరప్రభుదాసు రాధారాణి మహిమను భక్తులు వివరించారు.

న్యాయవాద గుమాస్తాల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బయ్య

కాకినాడ లీగల్: న్యాయవాద గుమాస్తాల సమస్యలను పరిష్కరించాలని నవ్యాంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గం స్పష్టం చేసింది. ఆదివారం కాకినాడ అడ్వకేట్ క్లర్క్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సిరియాల శ్రీను అధ్యక్షతన బార్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన రాష్ట్ర కార్యవర్గం సమావేశంలో 26 జిల్లాలో గుమాస్తాలు ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, డెత్ బెనిఫిట్ వంటి అంశాలపై చర్చించారు. ముందుగా సమావేశంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ కేరళ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన కోర్టు ఫీజులో ఒక్క శాతం న్యాయవాదులకు, న్యాయవాదుల గుమాస్తాలకు సంక్షేమ నిధికి ఇస్తున్నారని, అలాగే మన రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాదులకు, న్యాయవాదుల గుమాస్తాలకు సంక్షేమ నిధికి ఒక్క శాతం అమలు చేయలన్నారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ మాట్లాడుతూ కోర్టులో ఈ–సేవా కేంద్రాలు వల్ల గుమస్తాలు కనమరగు అయ్యే ప్రమాదం ఉందన్నారు. మాజీ లా సెక్రటరీ గాదం సత్య ప్రభాకరరావు మాట్లాడుతూ గుమాస్తాలు లేనిదే న్యాయవాదుల్లేరని, వారి వల్ల న్యాయవాది అనేక విషయాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అంగులూరి సుబ్బయ్య మాట్లాడుతూ గుమాస్తాల జీవన స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని, ప్రభుత్వం తీసుకొచ్చిన యాక్ట్ 13/92 ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ ఫండ్‌ను అమలు చేయడంలో ఉన్న లోపాలను తక్షణమే సరిదిద్దాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధన కార్యదర్శి నల్ల భాస్కరరావు మాట్లాడుతూ గుమాస్తాల పిల్లల విద్య, కుటుంబ భద్రత కోసం ప్రత్యేక నిధి అవసరమని చెప్పారు. ఈ సమావేశంలోకాకినాడ బార్ అసోసియేషన్ అధక్ష,కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి వీరభద్రరావు, కాకినాడ న్యాయవాదుల గుమస్తాల సంఘం సెక్రటరీ డి.రాంబాబు, జాయింట్ సెక్రటరీ జీఎస్ఆర్ కృష్ణ, కోశాధికారి యండూరి గోపి, వల్లా భాస్కరరావు, గుమస్తాలు సీహెచ్ ప్రభాకర్ నాయుడు, వడ్లమూరి సతీష్, బీరక శ్రీనివాస్, ఐవీ రమణ, జె.వర ప్రసాద్, దరిశిపూడి సూర్యనారాయణ మూర్తి, తానాల కాశీ విశ్వనాథ్, నముదూరి వెంకట్రావు, మర్ల సుబ్రహ్మణ్యం, నర్కేడమిల్లి నగేష్, మేడిశెట్టి గంగాధర్, జీఎస్ఆర్ కృష్ణ, మహదశ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

విద్యాంజలి ఇంటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక



విద్యాంజలి ఇంటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యులు

బోట్‌క్లబ్: రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో స్పాన్సర్ చేసిన విద్యాంజలి హైస్కూల్లో ఇంటరాక్ట్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రతిష్టాపన ఉత్సవం ఆదివారం జరిగింది. క్లబ్ అధ్యక్షులుగా పి.ఐశ్వర్య, కార్యదర్శిగా ఒమేరా మెహరీన్, ఉపాధ్యక్షులుగా పి.మహాలక్ష్మి, కోశాధికారిగా పి.కాటూన్, క్లబ్ అడ్వైజర్‌గా కె.శివాజీ, పోలియో చైర్ పర్సన్‌గా లోకేష్ సాయి ఫణీంద్ర, ఇంటర్నేషనల్ సర్వీస్ డైరెక్టర్‌గా కె.వివేక్, ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పి.ఆదిత్య, యూత్ సర్వీస్ డైరెక్టర్‌గా ఎస్.మాన్విదేవి బాధ్యత స్వీకరించారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఉపాధ్యక్షుడు పవన్, కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్ సాన, రోటరాక్ట్ ఇంటరాక్ట్ సబ్ కమిటీ చైర్మన్ చిరంజీవిరెడ్డి నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. క్లబ్ ఉపాధ్యక్షుడు మాజేటి పవన్ మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచి సేవా కార్యక్రమాల నిర్వహణలో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలన్న ప్రధాన ఆశయంతో ఇంటరాక్ట్ క్లబ్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీని ద్వారా విద్యార్థుల్లో సేవా భావంతో పాటు క్రమశిక్షణ, సామాజిక విషయాలు అవగాహన చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు.

ట్రాఫిక్ కోన్‌లు సరి చేయరూ..



రామారావుపేట ప్రకాశంవీధిలో విరిగిన ట్రాఫిక్ కోన్‌లు

కాకినాడ లీగల్: రామారావుపేట ప్రకాశంవీధిలో ప్రజల కోసం రోడ్డు పక్కన సైకిల్ ట్రాక్‌ను మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. రోడ్డుకు సైకిల్ ట్రాక్ మధ్య ట్రాఫిక్ కోన్‌లు కూడా ఏర్పాటు చేశారు. రామారావుపేట ప్రకాశంవీధిలో ఇటీవల జరిగిన యోగాంధ్ర కార్యక్రమం జరిగినప్పుడు ట్రాఫిక్ కోన్‌లు విరిగాయి. అప్పటి నుంచి వాటిని అలాగే వదిలేశారు. కనీసం వాటి స్థానంలో కొత్తవి వేయలేదు. ఇవి విరిగిపోవడం వల్ల సైకిల్ ట్రాక్‌పై వాహనాలు నడిపే అవకాశం ఉంది. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆటో కార్మికుల పొట్ట కొట్టింది



పిఠాపురంలో ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆందోళన చేస్తున్న రామకృష్ణ

పిఠాపురం: ప్రభుత్వం ఏదైనా పథకం అమలు చేస్తే ప్రజల పొట్ట నింపేలా ఉండాలి కాని పొట్ట కొట్టేలా ఉండకూడదని సీపీఐ నాయకులు సాకా రామకృష్ణ అన్నారు. పిఠాపురంలో ఆదివారం రజాల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆటో యూనియన్ సభ్యులు నిర్వహించిన ఆందోళనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్త్రీ శక్తి పథకం కింద మహిళలకు ఫ్రీ బస్సు అమలు చేయడంతో ఆటో కార్మికులు జీవనోపాధి కోల్పోయారన్నారు. పథకాలు ప్రవేశపెట్టే ముందు ఎవరికీ నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉదయం లేచి ఆటో నడుపుకుంటే గాని జీవనోపాధి సాగని ఆటో కార్మికుల పొట్ట కొట్టడం మంచి పద్ధతి కాదన్నారు. ఆటో డ్రైవర్లు డిగ్రీలు చదువుకుని జీవనోపాధి లేక ఈ వృత్తిని సాగిస్తున్నారన్నారు. ఫ్రీబస్సు పథకంతో ఆర్టీసీ ఆదాయం పడిపోతుందని, డీజిల్ వాడకాలు తగ్గుతాయని, ఆటో మెకానిక్‌లు ఉపాధి కోల్పోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పందించి మంచి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు నెలకు రూ.20 వేల చొప్పున గౌరవ వేతనం ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆటో కార్మికులతో కలసి దశల వారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పందిరి లోవరాజు, కంది ప్రసాద్, సన్నా బత్తుల లక్ష్మణ్ గోవింద్, బందిల మోహన్, బొండాడ అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రౌఢ కావ్యం నిత్య నూతన తరంగాల ప్రకాశ సౌందర్యలహరి



సౌందర్య లహరిపై ప్రసంగిస్తున్న ప్రముఖ పండితురాలు గంటి బాలా త్రిపుర సుందరి రాణి

బోట్‌క్లబ్: ఆదిశంకరులు తీసుకు వచ్చిన ప్రౌఢ కావ్యం చక్కని వ్యాకరణం చందస్సుతో నిర్మించిన పురాతన నిత్య నూతన తరంగాల ప్రకాశ సౌందర్యలహరి అని ప్రముఖ పండితురాలు గంటి బాలాత్రిపురసుందరి రాణి విశ్లేషణ చేశారు. వేణుగోపాల సంస్కృత ప్రచార సభలో ఆదివారం గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె సౌందర్యలహరిపై ప్రసంగించారు. సభకు అధ్యక్షత వహించిన ఇండియన్ రెడ్ క్రాస్ రాష్ట్ర అధ్యక్షుడు వైడీ రామారావు మాట్లాడుతూ సంస్కృత ప్రచార సభ లాంటి సంస్థలు కాకినాడ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేస్తున్నాయన్నారు. రెడ్ క్రాస్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా పలు ప్రాంతాల్లో సేవా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కృత ప్రచార సభ గౌరవాధ్యక్షుడు జీవీ కృష్ణంరాజు, అధ్యక్షుడు జీవీకే వర్మ, ప్రధాన కార్యదర్శి పీఎస్ఎస్ కిరణ్, కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సరిపెల్ల శ్రీరామ చంద్ర మూర్తి, కోశాధికారి చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

కాకినాడ జిల్లాకు నాయకర్ పేరుపెట్టాలి



మహాలక్ష్మి ఆలయం వద్ద మాట్లాడుతున్న వాడ్రేవు వీరబాబు

తాళ్లరేవు: కాకినాడ జిల్లాకు ప్రముఖ దాత, దివంగత మల్లాడి సత్యలింగం నాయకర్ పేరు పెట్టాలని పలువురు డిమాండ్ చేశారు. ఆదివారం కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెంలో మహాలక్ష్మి ఆలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు పొన్నమండ రామలక్ష్మి, మత్స్యకార నాయకుడు వాడ్రేవు వీరబాబు, వైదాడి నూకరాజు, కొపనాతి నాగరాజు తదితరులు మాట్లాడారు. ఎంతో కష్టించి సంపాదించిన యావదాస్తిని విద్యాలయాలు, దేవాలయాలకు రాసిచ్చిన మహాదాత నాయకర్ అని అన్నారు. 1,400 ఎకరాల భూమిని ధారాదత్తం చేసిన మహోన్నత వ్యక్తి నాయకర్ అని కొనియాడారు. ఈ డిమాండ్‌తో కాకినాడలో ఈ నెల 2న పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఓలేటి నరసింహస్వామి, పాలెపు ధర్మారావు, సంగాడి శ్రీనివాస్, వాతాడి ఆదినారాయణ, ధర్మారావు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయినికి సత్కారం



హెచ్‌ఎం రత్నకుమారి దంపతులను సత్కరిస్తున్న, ఎంఈఓ బుల్లికృష్ణవేణి తదితరులు

కరప: స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో నడకుదురు ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని బోడపాటి రత్నకుమారి పదవీ విరమణ సందర్భంగా సత్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. ఉపాధ్యాయుల తరపున ఎంఈఓ కె.బుల్లి కృష్ణవేణి ఆమెను ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయినిగా, హెచ్‌ఎంగా సుదీర్ఘకాలం పని చేసి అందరి మన్ననలు పొందారన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ హెచ్‌ఎం రత్నకుమారి చేసిన సేవలు మరువలేనివన్నారు. వివిధ ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు హెచ్‌ఎం రత్నకుమారి దంపతులను సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. సన్మాన గ్రహీత రత్నకుమారి మాట్లాడుతూ 39 ఏళ్ల సర్వీసులో సహకరించిన ప్రజాప్రతినిధులకు, సాటి ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు. గొడ్డటిపాలెం మాజీసర్పంచ్ వాసంశెట్టి శ్రీనుబాబు, ప్రజాప్రతినిధులు బండారు మురళి, వి.ముత్యాలరావు, ఉపాధ్యాయులు వాకాడ వెంకటరమణ, బి.రాంబాబు, విజయలక్ష్మి, రాజబాబు, పి.నాగేశ్వరరావు, సురేష్, చినబాబు, మహ్మద్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లకు

చట్టాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఫెడరేషన్ ఫౌండర్ మతుకుమిల్లి శ్రీవిజయ్

బాలాజీచెరువు: ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలల ఫెడరేషన్ ఫౌండర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ పేర్కొన్నారు. స్థానిక ప్రాబిన్ కన్వెషన్ హాల్లో ఆదివారం ప్రైవేట్ పాఠశాలల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవిజయ్ మాట్లాడుతూ కరస్పాండెంట్లను అధికారులు చిన్నచూపు చూస్తున్నారని, తమ హక్కులు తెలుసుకుని ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకుంటూ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్రంలో విద్యావ్యవస్థకు ఎంతో సేవలు అందిస్తున్నాయని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారన్నారు. ఈఎస్ఐ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఈఎస్ఐ సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రావిండెంట్ ఫండ్ కన్సల్టెంట్ బాబ్జి పీఎఫ్ లాభాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూనైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ ఫెడరేషన్ చైర్మన్ దాసరి శ్రీనివాసరావు, సామా ఈశ్వరరావు, పి.కనకరాజు, ఉమ్మడి జిల్లాలకు చెందిన 500లకు పైగా ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్

బోట్‌క్లబ్: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా వినాయక పందిళ్లలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ నిర్వాహకులను కోరారు. నగరంలో అనేక ప్రాంతాల్లోని మండపాలను ఆదివారం సందర్శించారు. మట్టి గణేష్, పూజకు ఉపయోగించే దళాలు, పత్రి పర్యావరణ పరిరక్షణకు మార్గాలన్నారు. ప్రతి ఒక్క పందిరి నిర్వాహకులు గణేశ ఉత్సవ సమితులను సంప్రదించి నియమానుసారం నిర్వహించాలన్నారు. హరికథలు, బుర్రకథలు, కోలాట నృత్యాలను ఆదరించాలన్నారు. తమ పరిషత్ ఆధ్వర్యంలో భగవద్గీతను పందిళ్లలో చదువుతున్నామన్నారు. నిమజ్జన సమయంలో ఆధ్యాత్మికతతో శాంతియుతంగా సంప్రదాయబద్ధంగా ఊరేగింపు చేసి నిమజ్జనం చేయాలన్నారు. ఈ సందర్భంగా భగవద్గీతత పోటీలు నిర్వహించి విజేతలకు వారికి బహుమతులు అందించారు. కార్యక్రమం పరిషత్ కోశాధికారి గుండోజీ ఉదయ్ భానోజీరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బీవీడీ రవివర్మ పాల్గొన్నారు.

గణపతికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సంపత్ విజయగణపతి

బోట్‌క్లబ్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక దేవదాయశాఖ డీసీ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంపత్ విజయ గణపతి స్వామివారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక పంచామృతాభిషేకం, అనంతరం సామూహిక లక్ష్మీగణపతి హోమం చేశారు. జిల్లా దేవదాయశాఖాధికారి కనపర్తి నాగేశ్వర్రావు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణీంద్రకుమార్, ఆలయ ఈఓ వి.వెంకట శ్రీనివాసరావు, సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.